సాక్షి
బాపట్ల
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024




మహాలక్ష్మి గుండెపాటమ్మ తిరునాళ్ల

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామ దేవత మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారి తిరునాళ్ల శనివారం ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రవికిరణ్ పాల్గొన్నారు.



విస్తృతంగా వాహనాల తనిఖీలు

భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం భట్టిప్రోలు చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక బృందానికి చెందిన అధికారిణి జ్యోతి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 507.50 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,700 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

బగళాముఖి అమ్మవారిని సందర్శించిన జస్టిస్ శివశంకర్



చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలు ఉన్న ప్రముఖ ఆలయాలను రాష్ట్ర జ్యుడీషియల్ రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ శివ శంకర్ శనివారం సందర్శించారు. తొలుత స్వయంభువు శ్రీ బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మేనేజర్ నరసింహమూర్తి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించి అమ్మవారి చిత్రపటాలను జ్ఞాపికగా అందజేశారు. అనంతరం ప్రముఖ శైవ క్షేత్రమైన లింగోద్భవస్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. శివశంకర్ వెంట హైకోర్టు న్యాయమూర్తి గుంటూరు శేషమోహన్ ఉన్నారు.

నిఘా తీవ్రం చేయండి

మాచర్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో డెప్యూటీ కమిషనర్ కె. హేమంత్ నాగరాజు శనివారం సిబ్బందితో కలసి మాచర్ల, విజయపురిసౌత్ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విజయపురిసౌత్ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేశారు. అక్రమంగా మద్యం రవాణా కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద పూర్తిస్థాయిలో తనిఖీ చేపట్టాలని చెప్పారు. ఆయన వెంట మాచర్ల సెబ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.పి. కిశోర్, ఎం. రవీంద్రబాబు తదితరులున్నారు

జిల్లాలో 8 నామినేషన్లు దాఖలు

బాపట్లటౌన్: జిల్లాలో శనివారం ఎనిమిది నామినేషన్లు దాఖలు అయ్యాయి. వేమూరు, అద్దంకి నుంచి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన కట్టపోగు విజయ్‌కుమార్, గుమ్మా సదాశివరావు, రేపల్లె, అద్దంకి నుంచి బహుజన సమాజ్‌పార్టీకి చెందిన డొక్కా శ్రీనివాసరావు, మందా జోసఫ్, బాపట్లలో స్వతంత్ర అభ్యర్థులుగా ఉప్పాల మురళీ, కొచ్చెర వినయ్‌రాజు, టీడీపీ నుంచి వేగేశన హరికుమారి, అద్దంకిలో కాంగ్రెస్ పార్టీ నుంచి అడుసుమల్లి కిషోర్ బాబు నామినేషన్లు దాఖలు చేశారు.

చెల్లిని రక్షించబోయి..

- అన్న, స్నేహితుడు గల్లంతు
- అడిగొప్పల సమీపంలోని సాగర్ కుడి కాల్వ వద్ద ఘటన

దుర్గి: చెల్లిని రక్షించబోయి అన్న, అతని స్నేహితుడు గల్లంతైన ఘటన మండలంలోని అడిగొప్పల సమీపంలోని సాగర్ కుడి కాల్వలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన షేక్ మస్తాన్‌బీ అడిగొప్పల పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తగా పని చేస్తోంది. ఆమె కుమారుడు షేక్ ఇస్మాయిల్ రెండు రోజుల కిందట పుట్టినరోజు సందర్భంగా గుంటూరు నుంచి అడిగొప్పలకు స్నేహితుడు షేక్ యూసఫ్‌తో కలసి తల్లి మస్తాన్‌బీ వద్దకు వచ్చాడు. శనివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు గ్రామ సమీపంలోని సాగర్ కాల్వ కట్టకు కుటుంబ సభ్యులంతా వెళ్లారు. వారంతా సరదాగా నీటి వద్ద గడుపుతుండగా , పక్కనే ఉన్న ఇస్మాయిల్ చెల్లెలు ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయింది. ఆమెను రక్షించేందుకు అన్న ఇస్మాయిల్, అతని స్నేహితుడు యూసఫ్ కాల్వలో దూకి కాపాడి ఒడ్డుకు చేర్చారు. అయితే ఇద్దరు కాల్వ నుంచి ఒడ్డుకు వస్తున్న క్రమంలో నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయారు. స్నేహితులిద్దరూ పదవ తరగతి పరీక్షలు రాశారు. ఇద్దరి వయస్సు 16 సంవత్సరాలు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కోటయ్య, పోలీసులు గల్లంతైనవారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఘటనా స్థలికి చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడారు. కాల్వకు నీటి ప్రవాహం తగ్గించి గాలింపు చర్యలు చేపట్టాలని ఆయన నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

టీడీపీ పశ్చిమ అభ్యర్థి గళ్లా మాధవిపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: టీడీపీ ప్రచారంలో బాలుడిని వినియోగించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీ టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గళ్లా మాధవి ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు వేళంగిణీనగర్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆరు సంవత్సరాల బాలుడిని ప్రచారంలో ఉపయోగించారు. దీనిపై ఎంసీసీ టీమ్ ఇన్‌చార్జి ఝాన్సీరాణి టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గళ్లా మాధవిపై అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణప్రసాద్ దిగుమతిపై ఫైర్

- పచ్చ పార్టీలో నాన్ లోకల్ చిచ్చు
- అభ్యర్థుల మధ్య కుదరని సయోధ్య
- బాపట్ల ఎంపీ అభ్యర్థిపై ఎమ్మెల్యే అభ్యర్థుల్లో విముఖత
- కృష్ణ ప్రసాద్‌ను తెలంగాణ నుంచి డంప్ చేసుకున్న పచ్చ పార్టీ
- చంద్రబాబు ప్రజాగళం సభలకు పరిమితమైన కృష్ణప్రసాద్
- పార్లమెంట్ పరిధిలో ప్రచారానికి డుమ్మా
- అసెంబ్లీ అభ్యర్థులతో మొక్కుబడి పలకరింపు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల పార్లమెంటు పచ్చ పార్టీ అభ్యర్థిగా తెలంగాణకు చెందిన ఐపీఎస్ అధికారి తెన్నేటి కృష్ణప్రసాద్‌ను దిగుమతి చేయడం ఆ పార్టీలో చిచ్చు రేపుతోంది. ఆయన కేవలం పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల పరిచయ కార్యక్రమానికే పరిమితమయ్యారు. పార్లమెంటు పరిధిలో ఎన్నికల ప్రచారంలోనూ మొక్కుబడిగా పాల్గొంటున్నారు. పార్టీకి చెందిన ముఖ్యనేతలతోనూ ఆయన అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. కృష్ణప్రసాద్ వ్యవహార శైలిపై పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

నేతల గోడు వినిపించుకోని బాబు

బాపట్ల పార్లమెంటుకు లోకల్ అభ్యర్థి అయితే బాగుంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తదితరులు సూచించినా చంద్రబాబు వినిపించుకోలేదు. కృష్ణప్రసాద్ తెలంగాణ బీజేపీలో కీలక నేతగా, పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. ఆయన్ను తెచ్చి బాపట్ల పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా నిలపడాన్ని ఇక్కడి పచ్చపార్టీ నేతలు జీర్ణించుకోలేకున్నారు. కృష్ణప్రసాద్ ఐపీఎస్ అధికారి కావడం, ఈ ప్రాంతంలో విధులు నిర్వహించటంతో ఆయన్ను ఇప్పటికీ పోలీసు వాసన వీడలేదు. రాజకీయనాయకుడి అవతారమెత్తినా ఆయన అందులోకి పరకాయ ప్రవేశం చేయలేకపోతున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థులతో పరిచయ కార్యక్రమం మాత్రమే ముగించారు. వారితో కలిసి పని చేయడం లేదు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం లేదు. ఇటు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులూ ఆయన్ను ప్రచారానికి పిలువడం లేదు. దీంతో ఒంటరిగానే ఉండిపోయారు. 'వేస్తే వారితోపాటు నాకూ ఓటు వేస్తారు.. లేక పోతే లేదు.. మునిగితే అందరం మునుగుతాం.. తేలితే అందరం తేలుతాం' అనే చందంగా కృష్ణ ప్రసాద్ వ్యవహార శైలి ఉందని పచ్చపార్టీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికీ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులు ప్రచారంలో ఉండగా.. ఎంపీ అభ్యర్థి మాత్రం తనను టీడీపీ అధినేత పట్టుబట్టి అభ్యర్థిగా తెచ్చుకున్నారన్న ధోరణితో వ్యవహరిస్తున్నారని నేతలు బాహాటం గానే విమర్శిస్తున్నారు. కృష్ణప్రసాద్ తీరును పచ్చపార్టీ అభ్యర్థులు జీర్ణించుకోలేకున్నారు.

ఎన్నికల్లో పుట్టి మునగడం ఖాయం

బలమైన స్థానిక వ్యక్తిని పార్లమెంటు అభ్యర్థిగా నిలిపితే అది ఎమ్మెల్యే అభ్యర్థులకు కలిసి వచ్చేదని, కానీ ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థుల బలమే ఎంపీ అభ్యర్థికి పనిచేయాల్సి వస్తుందని పచ్చపార్టీ అభ్యర్థులు వాపోతున్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎవరో ప్రజలు చూసే పరిస్థితి లేకుండా పోయిందని వారు పేర్కొంటున్నారు. అభ్యర్థి మన రాష్ట్రానికి చెందినవారు కాకపోవడం మరింత నష్టం చేకూర్చుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. డబ్బులు గుంజి తెలంగాణ నుంచి తెచ్చి అభ్యర్థిని పెట్టారన్న అధికార పార్టీ విమర్శలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఉందని పచ్చపార్టీ నేతలు వాపోతున్నారు. అయినా అధినేతకే లేకపోతే తమకు మాత్రం ఎందుకన్న రీతిలో జిల్లా టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. దీంతో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పుట్టి మునగడం ఖాయమని పచ్చ పార్టీ కార్యకర్తలు ఆందోళనలో ఉన్నారు.

చిత్రం.. భళారే విచిత్రం

- టీడీపీ ఎంపీ అభ్యర్థికి కారు లేదటా!
- అఫిడవిట్‌లో చూపించిన కృష్ణప్రసాద్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల టీడీపీ అభ్యర్థి, మాజీ ఐపీఎస్ అధికారి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు కారు లేదంటా ! చిత్రంగా ఉంది కదూ...తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆయన బాపట్ల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.

ఈ సందర్భంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో తనకు కారు లేదని తెలిపారు. కృష్ణప్రసాద్ పేరుతో రూ. 1,99,18,696 విలువైన చరాస్తులు, రూ. 7, 31,87,000 స్థిరాస్తులు కలిపి మొత్తం రూ. 9,31,03,679 ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన భార్య శిరీష పేరిట రూ. 1,50,51,660 విలువైన చరాస్తులు, రూ. 5,11,50,000 విలువైన స్థిరాస్తులతో కలిపి మొత్తం రూ. 6,62,01,660 ఉన్నట్లు చూపించారు. బ్యాంకులో ఆయన భార్య పేరిట బ్యాంకులో రూ. 1.94 కోట్ల రుణం ఉన్నట్లు తెలిపారు. కృష్ణప్రసాద్ వద్ద రూ. 5 లక్షలు, భార్య వద్ద రూ. 5 లక్షల నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు కృష్ణప్రసాద్ వద్ద 6.66 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, భార్య వద్ద రూ. 60.66 లక్షల విలువైనవి ఉన్నట్లు చూపించారు.

తోబుట్టువునై అండగా ఉంటా!



ముస్లింలను ఓట్లు అభ్యర్థిస్తున్న వెంకటేష్

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్
- ఫ్యాన్ ధాటికి సైకిల్‌కి పంక్చర్
- రాష్ట్రంలో ఈసారి ఫ్యాన్ ప్రభంజనమే..

చీరాల: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గాలిలో సైకిల్ కొట్టుకపోవడం ఖాయమని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. పట్టణంలోని నెహ్రూ కూరగాయల మార్కెట్‌లో శనివారం కొనుగోలుకు వచ్చిన ప్రజలతో మమేకమయ్యారు. ప్రతీ దుకాణాన్ని సందర్శించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయమని అభ్యర్థించారు. తనకు ఓటేసి ఆశీర్వదిస్తే తోబుట్టువుగా తోడై ఉంటానని వారికి హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా వెంకటేష్ ప్రజలతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో చీరాల నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. ప్రజల సంక్షేమానికి బృహత్తర పథకాలు అందించిన జగనన్న మళ్లీ సీఎం అయితేనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతాయని పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో అన్ని వర్గాల అభ్యున్నతికి, అభివృద్ధితో పాటుగా ప్రజల సంక్షేమానికి అండగా నిలిచామని తెలిపారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఎంపీ నందిగం సురేష్ సోదరుడు నందిగం వెంకట్, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, పట్టణాధ్యక్షుడు కొండ్రు బాబ్జి, గుంటూరు మాధవరావు, కౌన్సిలర్ యానాదిరావు, సేవాదళ్ సెక్రటరీ గోలి గంగాధర్, అమృతరావు, రమేష్, అభిషేక్, ప్రసాద్‌రెడ్డి, ప్రశాంత్, స్వాములు ప్రతాప్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలో వెంకటేష్ విస్తృతంగా పర్యటించి వివిధ రాజకీయ పార్టీల నాయకుల మద్దతు కోరారు.

వస్త్ర వ్యాపారులకు అండ

వస్త్ర వ్యాపారానికి పేరుగాంచిన చీరాలలో వ్యాపారులందరికీ అండగా ఉంటున్నామని, ఎన్నికల్లో తనకు ఓటేసి ఆదరించాలని వెంకటేష్ కోరారు. పట్టణంలోని బెస్తపాలెం, కామధేను మార్కెట్, ఆర్‌ఆర్ రోడ్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి వస్త్ర దుకాణాన్ని సందర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల బ్రోచర్లను వ్యాపారస్తులకు అందించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల నుంచి చీరాలలో అభివృద్ధి పనుల్ని వేగంగా పూర్తి చేయడంతో పాటు వ్యాపారులకు అన్ని విధాలుగా అండగా నిలిచామని తెలిపారు. వివాదాలు, ఘర్షణలు లేకుండా ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునేలా అండగా నిలిచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ సోదరుడు నందిగం వెంకయ్య, మాజీ కౌన్సిలర్ కాటా శివరాంప్రసాద్, కె.వి. సుబ్బారావు, లీలాధర్, రమేష్, శివ, శేఖర్, సురేష్ ఉన్నారు.

అనైతిక కూటమిని తరిమి కొడదాం



వెల్లటూరులో నిర్వహించిన ర్యాలీలో వరికూటి అశోక్‌బాబు, దేవినేని, పార్టీ శ్రేణులు

- టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరిక
- ఎన్నికల ప్రచారంలో దేవినేనితో కలసి పాల్గొన్న అశోక్‌బాబు

వెల్లటూరు(భట్టిప్రోలు): ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేని టీడీపీ, బీజేపీ, జనసేన అనైతిక కూటమిని రానున్న ఎన్నికల్లో తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరులో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో కలసి అశోక్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎన్నికల్లో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం, సీఎం జగన్, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులపై తిట్ల పురాణమే తప్పా ప్రజల కోసం ఏమి చేస్తామో చెప్పలేని దుస్థితిలో కూటమి పార్టీలు ఉన్నాయని విమర్శించారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా ఎన్నో సంక్షేమ పథకాల్ని అమలు చేసిన సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఆయన ఓటర్లను కోరారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. టీడీపీకి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోటూరి చంద్రశేఖరరావు, మాజీ సర్పంచ్ గోగినేని శేషుబాబు, న్యాయవాది మైలా శ్రావణ్‌కుమార్, పమిడిముక్కల శ్రీకాంత్‌ల సమక్షంలో ఓసీ, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు చెందిన 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి అశోక్‌బాబు, దేవినేని కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి, మాజీ సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు దారావత్ కుమారి బాయి, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, మండల ఎన్నికల పరిశీలకులు కొండా శివప్రసాదరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్లా బేగ్, మద్దుల గిరిధర్, బండారు శ్రీనివాసరావు, గురిందపల్లి సునీల్, చందోలు రవికుమార్, సిరాజుద్దీన్, జల్లి జ్యోషికాంత్, మోటూరి చౌదరి, చౌటూరి రవీంద్ర, కుందేటి రమేష్, మాతంగి రత్నకుమార్, కృష్ణ నాయక్, స్వామినాయక్, ముసలయ్య, సీతారామయ్య, మోపిదేవి కృష్ణారావు, శంకర్, కట్టా నాగరాజు, లాజర్, శివమణి, తిరువీధుల బాలాజి పాల్గొన్నారు.

టీడీపీకి గెలిచే సీన్ లేదు

- అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి
- 22న నామినేషన్



సమావేశంలో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: తెలుగుదేశం పార్టీ గెలవదని చంద్రబాబు నాయుడుకు కూడా తెలుసునని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ జగనన్న పరిపాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. తాను సోమవారం నామినేషన్ వేస్తున్నానని, వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని ఆయన కోరారు. ఆ రోజు జరిగే బైకు ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని తెలిపారు. తాను నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ఈ ఎన్నికల తరువాత అద్దంకిలో పెనుమార్పు సంభవిస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక స్థానం కల్పిస్తానని హనిమిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ రాకతోనే సుభిక్ష పాలన

- బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్
- ఇంకొల్లులో అసెంబ్లీ అభ్యర్థి బాలాజీతో కలసి రోడ్ షో



ఇంకొల్లులో రోడ్ షోలో మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్రంలో సుభిక్షమైన పాలన తిరిగి రావాలంటే వైఎస్సార్ సీపీని తిరిగి గెలిపించుకోవాలని బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి బాపట్లలో ఆయన పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రావి రామనాథంబాబుతో కలసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి లేని పారదర్శకమైన పాలన అందించిన ఘనత వైఎస్. జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన ముఖ్యమంత్రి ఆయనేనని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ వారిని ముందుకు తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో 33 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పర్చూరు అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుకు రెండు సార్లు ఓటు వేసి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, ఎంపీపీ బండారు అనూష, షంషుద్దీన్, బాబుల్లా, బండ్ల వెంకట సుబ్బారావు, తానికొండ ఎలియాజర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డికి ఘన నివాళులు

అంతిమయాత్రలో భారీగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



వెంకటరెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో టీడీపీ అరాచకానికి బలైన జేసీఎస్ కన్వీనర్ మేకా వెంకటరెడ్డి (50) అంతిమయాత్ర శనివారం తాడేపల్లి నుంచి కుంచనపల్లి స్వర్గపురి వరకు నిర్వహించారు. వెంకటరెడ్డి ఇంటివద్దకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకుని నివాళులర్పించారు. ముందుగా ప్రభుత్వ సలహాదారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డిలు వెంకటరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ వెంకటరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అంతిమ యాత్ర ఇలా...

మేకా వెంకటరెడ్డి నివాసం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర పార్టీ కార్యాలయం మీదుగా కుంచనపల్లి స్వర్గపురి వరకు నిర్వహించారు. దారి పొడవునా వెంకటరెడ్డి అమర్ రహే, తెలుగుదేశం గూండాలను శిక్షించాలంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రత్యేక వాహనంపై వెంకటరెడ్డి మృతదేహం ఉంచారు. దారి పొడవునా పూలు చల్లారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యలు అంతిమ యాత్ర పూర్తయ్యే వరకు ఉండి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వెంకటరెడ్డి మృతికి కారణమైన వారిని శిక్షించే వరకు పోరాటం నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు వెల్లడించారు. ఆయన మంచితనం వల్ల స్థానికంగా ఉన్న అన్ని పార్టీల నాయకులు అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు, ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, రూరల్ మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, మేకా వెంకటరామిరెడ్డి, భూపతి కిశోర్‌నాయుడు, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, మేడా పండు, బాలసాని అనిల్, ముదికొండ ప్రకాష్, బత్తుల దాసు, మేకల నాగయ్య, మహేష్, నియోజకవర్గంలోని మంగళగిరి పట్టణ రూరల్, దుగ్గిరాల మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకటరెడ్డి మృతదేహం

క్లుప్తంగా

క్రీడాకారుడు అశోక్‌కు ఎంపీ మోపిదేవి అభినందనలు



రేపల్లె రూరల్: థాయ్ బాక్సింగ్‌లో జాతీయస్థాయిలో బంగారు పతాకం సాధించిన నిజాంపట్నానికి చెందిన కొల్లాటి అశోక్‌ను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అభినందించారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం శాలువ కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంత గ్రామానికి చెందిన అశోక్, థాయ్‌బాక్సింగ్‌లో మరిన్ని పతాకాలు సాధించాలని కోరారు. ఇంటర్నేషనల్ థాయ్‌బాక్సింగ్ పోటీలకు సిద్ధమవ్వాలని, దానికి కావాల్సిన సహకారాలు ఎల్లప్పుడు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్, నిజాంపట్నం ఎంపీపీ మోపిదేవి విజయనిర్మలా హరనాథ్, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవరావు పాల్గొన్నారు.

దశదిన కర్మకు వెళ్లి వస్తుండగా..

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో దృశ్యం



క్షతగాత్రుడు కోటేశ్వరరావు

బల్లికురవ: దశదిన కర్మకార్యక్రమాలకు హాజరై తిరిగి స్వగ్రామానికి బైకుపై వెళ్తుండగా లారీ ఢీకొట్టంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. ఈఘటన శనివారం సాయంత్రం నార్కెట్‌పల్లి–మేదరమెట్ల నామ్ రహదారిలోని మండలంలోని వినుకొండ క్రాస్ రోడ్ వద్ద చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సురభి పెదఅంజయ్య(60), పులి కోటేశ్వరరావు ఇద్దరు బైక్‌పై బల్లికురవ వచ్చి గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. ఈక్రమంలో వినుకొండ క్రాస్ రోడ్డు వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న లారీ బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో పెద అంజయ్య అక్కడికక్కడే మృతిచెందగా కోటేశ్వరరావుకు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తొలుత అద్దంకి వైద్యశాలకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. మృతుడు అంజయ్యకు ఇరువురు కుమార్తెలు ఉన్నారు. బల్లికురవ ఏఎస్ బాక్రృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బాధితులకు అండగా ఉంటా..

ప్రమాదం జరిగిన విషాన్ని తెలుసకుని హుటాహుటిన అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. చనిపోయిన, తీవ్రగాయాల పాలైన రెండు కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

జగనన్నకు మళ్లీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

- అధికార దాహంతోనే కూటమి ఒప్పందాలు
- ఎన్నికల ముందు ఒకలా.. తరువాత మరోలా చంద్రబాబు నైజం
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- 22న ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ నామినేషన్



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి రమణారావు, పక్కన అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె రూరల్: అధికారం కోసం ఎన్నికల ముందు ఒకలా, అధికారంలోకి వస్తే మరోలా విషం చిమ్మినట్లు ప్రవర్తించటం చంద్రబాబునాయుడుకు అలవాటేనని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు ఆరోపించారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అధికారం కోసం అమలు చేయలేని అబద్ధపు హామీలు ఇవ్వటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ప్రజలు జగనన్నకు చేరువయ్యారని, మరోమారు ఆయన ముఖ్యమంత్రి అవ్వటం కాయమని గ్రహించిన చంద్రబాబు రాష్ట్రంలోని జనసేనతో, కేంద్రంలోని బీజేపీతో జతకట్టి ఎన్నికలకు సిద్ధమయ్యారన్నారు. ఇచ్చిన మాటను, హామీలను అమలు చేయటం జగనన్న నైజమైతే, తుంగలోకి తొక్కటం చంద్రబాబుకు అలవాటన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నైజంను గ్రహించారని మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిట చేర్చిన జగనన్న ముందు ఎన్ని కూటములైనా చిత్తవ్వక తప్పదన్నారు. పార్టీ అధిష్ఠానం రేపల్లెలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నియమించిన గణేష్ విజయానికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. గణేష్‌ను గెలిపించుకుని జగనన్నకు రేపల్లె నియోజకవర్గంను కానుకగా అందించాలని పిలుపునిచ్చారు.

22న నామినేషన్ కు తరలిరావాలి

వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ నామినేషన్ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. తొలుత కౌన్సిలర్‌లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ దేవగిరి సాంబశివరావు పాల్గొన్నారు.

అద్దంకిలో తెలుగుదేశం పార్టీ ఖాళీ



సూరేపల్లిలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారిని అభినందిస్తున్న పానెం చిన హనిమిరెడ్డి

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి
- సూరేపల్లిలో వంద కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

బల్లికురవ: అద్దంకిలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతోందని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. శనివారం బల్లికురవ మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీలోని సూరేపల్లి గ్రామానికి చెందిన సుమారు వంద కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరగా వీరందరికి హనిమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు గ్రామాల వారీగా ఆకర్షితులవుతున్నారని తెలిపారు. జగనన్న పార్టీలు కులమతాలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పాలనకు నియోజకవర్గంలో టీడీపీ అడ్రస్ రోజురోజుకు గల్లంతు అవుతుందని పేర్కొన్నారు. మొన్న బల్లికురవ, నిన్న అద్దంకి తిరిగి ఈ రోజు బల్లికురవ మండలాల్లో పార్టీలో చేరేందుకు తనకు మద్దతు ఇచ్చేందుకు యువత ఎంతో ఉత్సాహాన్ని చూపుతున్నారని చెప్పారు. జగనన్న సంక్షేమ రాజ్యాన్ని తిరిగిచ్చుకోవాలంటే అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. చంద్రబాబు బూటకపు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైఎస్సార్ సీపీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూస్తే తాను అద్దంకి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందటంతో పాటు 175కు 175 సీట్లు కైవసంతో జగనన్న రెండోసారి సీఎం కావడం ఖాయమని చెప్పారు. మే13న జరిగే ఎన్నికల్లో తనకు బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌కు రెండు సార్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని కోరారు. అనంతరం హనిమిరెడ్డితో పాటు మండల ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డిని సత్కరించారు. పార్టీలో చేరిన వారిలో కొనుదుల అంకాలరెడ్డి, వసంతరెడ్డి, వెంకటరెడ్డి, తొరటి శరాబంది, చిన పేరయ్య, శ్యాంసన్, దొడ్డా శింగరకొండ, ఏడు కొండలు, నూకతోటి రామయ్య, బొంతు లక్ష్మీకాంత్, లక్ష్మీనారాయణ, ఊనాది సాంబశివారెడ్డి, ఏకసిరి శింగరకొండ, రాంబాబు ఉన్నారు.

మూడో రోజు మూడు నామినేషన్లు

అద్దంకి: నియోజకవర్గానికి మూడో రోజు శనివారం మూడు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి టీడీ సునీల్ శనివారం తెలిపారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున అడుసుమల్లి కిశోర్‌బాబు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గుమ్మా సదాశివరావు, బహుజన్ సమాజ్‌వాద్ పార్టీ తరపున మందా జోసఫ్ నామినేషన్ దాఖలు చేశారని ఆయన చెప్పారు.

ఎస్సీలంటే చంద్రబాబుకు చులకన

- మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య
- మందకృష్ణ మాదిగ చంద్రబాబుకు ఎందుకు మద్దతిస్తున్నాడు!
- అసెంబ్లీ అభ్యర్థి హనిమిరెడ్డి గెలుపు కోసం కృషి



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ, పక్కన అసెంబ్లీ అభ్యర్థి హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: ఎస్సీలంటే చంద్రబాబుకు చలకన అని మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య అన్నారు. స్థానిక అద్దంకిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డికి మద్దతు ప్రకటించారు. బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ మాదిగ, మాలల అభివృద్ధికి రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తోడ్పాటు ఇస్తున్నారన్నారు. అధికారం ఉన్నప్పుడు ఒకరకంగా, లేనప్పుడు ఒక రకంగా చంద్రబాబు వ్యవహరిస్తారని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేక భావాలు ఉన్న చంద్రబాబుకు ఎందుకు మద్దతు ఇస్తున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ఎంతమంది కట్టకట్టుకుని గుంపులుగా వచ్చిన వైఎస్ జగన్ ఒక్కడే వచ్చి గెలుస్తాడన్నారు. అద్దంకిలో హనిమిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అండగా నిలవటం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లూరి చిరంజీవి మాదిగ, దాసరి నాగేశ్వరరావు, కొండ్రు శామ్యూల్, ప్రత్తిపాటి నాగయ్య, జిర్రా శ్యాంసన్ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



నిజాంపట్నం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

చెరుకుపల్లి: ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన రాంబొట్ల పాలెంలోని 262 పోలింగ్ కేంద్రం, గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 230, 31,32, 25 పోలింగ్ కేంద్రాలను ఎస్పీ శనివారం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా స్వేచ్ఛగా వారివారి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ టి.మురళీకృష్ణ, రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్‌బీ సీఐ మల్లికార్జునరావు, స్థానిక ఎస్‌ఐ వై.సురేష్, ఏఎస్‌ఐ బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి ఈవూరి విజయ్‌బాబు, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

నిజాంపట్నం: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ చెప్పారు. నిజాంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఎస్‌టీ టీమ్ చెక్‌పోస్టును శనివారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని కుణ్ణంగా తనిఖీ చేసి నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టే విధంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ సీఐ మల్లికార్జున్ పాల్గొన్నారు.

నగరం మండలంలో..

నగరం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. మండలంలోని నగరం, బొరమాదిగపల్లి, ఏలేటిపాలెం గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట బందోబస్త్ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, రేపల్లె రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ కోటేశ్వరరావు ఉన్నారు.

అక్రమ మద్యాన్ని పూర్తిస్థాయిలో అడ్డుకోవాలి

నోడల్ డెప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు



సిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ డెప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు

బాపట్లటౌన్/చినగంజాం: అక్రమ మద్యాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలని నోడల్ డెప్యూటీ కమిషనర్ కె. హేమంత్ నాగరాజు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం జిల్లాలోని పర్చూరు, చీరాల, బాపట్ల సెబ్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఆయా స్టేషన్ల పరిధిలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి, గ్రామాల్లోని అనుమానిత ప్రదేశాల్లో చేసిన దాడుల గురించి సమీక్షించి తగు సూచనలు చేశారు. నాటుసారాయి, అనధికార మద్యం విక్రయాలు, అక్రమ మద్యం నిల్వల గోడౌన్‌ల సమాచారం సేకరించి దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. పాత నిందితులను బైండ్ ఓవర్ చేయాలన్నారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మాధవనాయుడు



బాపట్లటౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక జిల్లా అధికారి సి.మాధవనాయుడు కోరారు. ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్న అగ్ని ప్రమాద వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లు, కళాశాలల్లోని విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. మాధవనాయుడు మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు అధికసంఖ్యలో జరిగే అవకాశం ఉందని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కళాశాలల్లో, ఆర్టీసీ బస్టాండ్‌లు, డిపోల్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదాలు సంభవిస్తే వాటిని వెంటనే అదుపు చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై క్షుణ్ణంగా వివరించారన్నారు. కార్యక్రమంలో జేమ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ విజయ్‌కుమార్, బాపట్ల ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

బల్లికురవ: ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు బలవర్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం బల్లికురవ మండలంలోని కూకట్లపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఇప్పల సుబ్బారెడ్డి(35) భార్య సునీతతో కలసి ఐదేళ్ల నుంచి రాజమండ్రిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఉద్యోగం చేస్తున్నారు. సుబ్బారెడ్డి ఇంటర్మీడియెట్ ఫిజిక్స్ అధ్యాపకుడుగా బోధన చేస్తున్నాడు. సునీత ఆరు నుంచి పదో తరగతి వరకు బోధిస్తోంది. జీతం పెంచాలని నెలరోజుల క్రితం యాజమాన్యాన్ని సుబ్బారెడ్డి కోరినట్లుగా తెలుస్తోంది. మేము ఇంతకన్నా ఇవ్వలేమని చెప్పటంతో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై పట్టణాలకు వెళ్లి ఉద్యోగాలకు ప్రయత్నించిన ఫలితం దక్కలేదు. భార్య సునీత మాత్రం రాజమండ్రిలోనే పనిచేస్తోంది. దీంతో సుబ్బారెడ్డి ఇంట్లో ఎవరులేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి సుబ్బారెడ్డి భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.